ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

- అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రికి త్వరలో శంకుస్థాపన
- అభివృద్ధికి ఎంఐఎంతో కలిసి ముందుకు సాగుతాం
- ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాతబస్తీ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ అనతి కాలంలోనే ఫ్లైఓవర్‌ను పూర్తి చేసిందన్నారు. జూపార్క్ నుంచి ఆరాంఘర్ వరకు ఆరు వరుసల్లో నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జిని సోమవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. సుమారు రూ.800 కోట్లతో నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ ఫ్లైఓవర్ పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదిగా నిలిచింది. దీనికి మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించినట్టు సిఎం ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత నగరమే అసలైన హైదరాబాద్ నగరం అని, నిజాం కాలంలోనే హైదరాబాద్ పేరు ప్రతిష్టలు పొందిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పివి నరసింహారావు పె ఓవర్ ఎక్స్‌ప్రెస్ హైవే బ్రిడ్జి నిర్మించారని, ఆ తర్వాత అతిపెద్ద ఫ్లైఓవర్ జూపార్క్ నుంచి ఆరాంఘర్‌దేనని చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రిని త్వరలోనే గోషామహల్‌లో నిర్మించేందుకు శంకుస్థాపన చేస్తామన్నారు. అభివృద్ధి, రోడ్ల విస్తీర్ణం, మూసీ నదిలోకి గోదావరి జలాలను తీసుకురావడం, మెట్రో రైలు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. జూపార్క్ నుంచి మీరాలం ఫిల్టర్ వరకు కేబుల్ బ్రిడ్జిని నిర్మించి అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. రీజినల్ రింగ్‌రోడ్ పనులు పూర్తయితే తెలంగాణ మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని, నగర అభివృద్ధికి ఎంఐఎంతో కలిసి ముందుకు సాగుతామని చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని, ఆ తర్వాత అభివృద్ధికి అందరితో కలిసి పని చేస్తామన్నారు. తెలంగాణలో చేయాల్సిన అభివృద్ధిపై తమ వాటా తమకు కావాలంటూ కేంద్రానికి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఈనెల 11న ఎంఐఎం ఎంపి, ఎమ్మెల్యేలు ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి సెక్రటేరియట్‌లో అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌తో 35 ఏండ్ల సాన్నిహిత్యం ఉందన్నారు. మూసీ నదిలో కబ్జాలు అన్నింటినీ తొలగించి మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు.

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పాత నగరమే మహానగరం అని ఇది మన అందరిదన్నారు. మలక్‌పేటలో ఐటీ టవర్ మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. పాతబస్తీలో కూడా ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని అభివృద్ధి చేసి ఉద్యోగ కల్పనకు కృషి చేస్తామన్నారు. హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. మీరాలం ట్యాంక్ అభివృద్ధిని చేపట్టాలని కోరారు. నల్లగొండ ఎక్స్ రోడ్ చౌరస్తాలో స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలన్నారు. జూబ్లీ బస్‌స్టాండ్ నుంచి ఫలక్‌నుమా వరకు రైలును వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. మిరాళంమండి నుంచి చార్మినార్ వరకు స్కై వాక్‌ను ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, మహ్మద్ ముబీన్, జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీలు ఆమెర్ ఆలీఖాన్, మీర్జా రహ్మత్ బేగ్, ఎం.ఎస్ ప్రభాకర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఎమ్మెల్సీలు నాయకులు పాల్గొన్నారు.

'స్వర రచనా ప్రతిభాశాలి మాధవపెద్ది సురేష్'

ప్రజాశక్తి కల్చరల్

నరుడా ఓ నరుడా ఏమి నీ కోరిక పాటకు అద్భుత సంగీతం అందించిన మాధవపెద్ది సురేష్ స్వర రచనా ప్రతిభాశాలి అని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ చంద్ర తేజాలయ మ్యూజిక్ అకాడెమీ నిర్వహణ లో ప్రఖ్యాత సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు ఘంటసాల పురస్కార ప్రదానం జరిగింది ముఖ్య అతిథిగా డాక్టర్ కె వి రమణ పాల్గొని కిన్నెర రఘురాం విశ్రాంత న్యాయ మూర్తి మధుసూదన్ ఆరాధన సంస్థ అధ్యక్షులు లోకం కృష్ణయ్యతో కలసి మాధవపెద్ది సురేష్ ను సత్కరించి నాద సార్వభౌమ బిరుదును ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురేష్ స్వర రచన చేసిన భైరవ ద్వీపం బృందావనం సినిమాలోని పాటలు అపురూపాలు అని ప్రశంసించారు చంద్ర తేజ పేరుకు తగ్గట్లు ఘంటసాల పద్యాలు ప్రచడం గా పాడగలరనీ కొనియాడారు. అధ్యక్షత వహించిన దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు పాటను పద్యాన్ని ఆస్వాదిస్తూ పాడటంలో దిట్ట చంద్ర తేజ అన్నారు సురేష్ సంగీత దర్శకత్వం లో వచ్చిన పాటలు అన్నీ సూపర్ హిట్స్ అన్నారు. ఈ సందర్భం గా సంక్రాంతి లక్ష్మి పురస్కారాలు గాయణులు విజయ లక్ష్మి,శ్రీదేవి రాధా రాణి అచ్యుత నాట్య గురువు నిర్మల ప్రభాకర్ లకు అతిథులు బహుకరించారు సన్మాన కార్యక్రమం తొలుత చంద్ర తేజ గాయనీ మణులుతో కలసి పాడిన పాటలు హాయిని గొలిపాయి విఖ్యాత కవి జాషువా మనుమడు సుశీల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

- ఉన్నత విద్యామండలి డైరీ ఆవిష్కరణలో చైర్మన్ బాలకృష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని డిగ్రీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందించాలని నిర్ణయించామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకృష్టారెడ్డి చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి నూతన సంవత్సరం డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో బాలకృష్టారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా ఈ స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. సబ్జెక్టుకు చెందిన ముఖ్యాంశాలను విద్యార్థులు గ్రహించేలా, పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. లోతైన అధ్యయనం చేసేవారి కోసం రెఫరెన్స్ పుస్తకాలు వివరాలను సైతం ఈ స్టడీ మెటీరియల్‌లో పొందుపరుస్తామని అన్నారు. పోటీపరీక్షల కోసం సన్నద్ధమయ్యే వారు కూడా ఉపయోగించుకునేలా ఈ స్టడీ మెటీరియల్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. డిగ్రీ కోర్సుల సిలబస్‌ను 30 శాతం చొప్పున మార్చాలని ఇప్పటికే నిర్ణయించామని వివరించారు. అందుకనుగుణంగా కొత్త సిలబస్‌ను రూపొందిస్తున్నామని అన్నారు. పరిశోధనలను ప్రోత్సహించేలా ఈ సిలబస్‌ను రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ నేపథ్యమున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా స్టడీ మెటీరియల్‌ను రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఎఫ్ఆర్సీ చైర్మెన్ గోపాల్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జాయింట్ సెక్రెటరీ సిఎస్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆర్‌టిసిని అభివృద్ధిలోకి తెచ్చాం

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఆర్‌టిసిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని హయగ్రీవా చారి మైదానంలో వరంగల్ రీజియన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 50 ఎలక్ట్రికల్ బస్సులను మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్‌టిసిని గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేయగా ఇందిరమ్మ ప్రభుత్వం ప్రగతి పథంలోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కారుణ్య నియామకాలను చేపట్టిందని, కొత్తగా 3000 మందికి ఆర్‌టిసిలో ఉద్యోగాలు కల్పించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణహితమైన 1000 ఎలక్ట్రిక్ బస్సులను నూతనంగా కొనుగోలు చేసిందన్నారు. తొలి దశలో ఎలక్ట్రిక్ బస్సులను జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నడిపిస్తుందన్నారు. హనుమకొండ జిల్లాకు 112 ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కేటాయించిందని, మొదటి విడతగా 50 బస్సులను, సంక్రాంతికి మరో 30 బస్సులను ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణాన్ని అమలుచేశామని, ఇప్పటివరకు 127 కోట్ల మంది మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించినట్టు తెలిపారు. దీనివల్ల రూ.4,500 కోట్లు ప్రభుత్వం ఆర్‌టిసికి చెల్లించిందన్నారు. జిల్లాలో ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ నిమిత్తం చార్జింగ్ స్టేషన్‌లకు రూ.10 కోట్లతో నిర్మించినట్టు తెలిపారు. భవిష్యత్తులో ఆర్‌టిసికి మరిన్ని మంచి రోజులు రానున్నాయన్నారు.

మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌టిసిని గత ప్రభుత్వం ప్రయివేటుపరం చేసేందుకు ప్రయత్నించిందని, కార్మికులు వ్యతిరేకించడంతో తప్పని పరిస్థితుల్లో యూటర్న్ తీసుకుందన్నారు. సంక్రాంతి నాటికి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, సాగు చేసే వ్యవసాయ భూమికి రైతు భరోసాను అందజేస్తామని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం ద్వారా వైద్య సేవల నిమిత్తం హైదరాబాద్ మహానగరానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఉచితంగా వెళ్లి వస్తున్నారని అన్నారు. పుణ్యక్షేత్రాలను కూడా మహిళలు ఉచితంగా దర్శించుకోగలుగుతున్నారని, దాంతో గతంలో కంటే దేవాలయాల ఆదాయం మరింత పెరిగిందన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ నగరానికి మంచి రోజులు వచ్చాయని, ప్రభుత్వం నగరాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం ప్రారంభించిన ఎలక్ట్రిక్ బస్సులో హనుమకొండ అశోక కూడలి సమీపంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కుడా చైర్మెన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, ఆర్ఎం ఉదయభాను, ఎన్‌డిసిఎల్ చైర్మెన్ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వర్సిటీలకు ప్రత్యేక చట్టం తేవాలి

- రెగ్యులర్ నియామకాల కంటే ముందు కాంట్రాక్టు అధ్యాపకులను అబ్జార్బ్ చేయండి
- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు కాంట్రాక్టు అధ్యాపకుల జెఎసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న ఈ సందర్భంలో రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక చట్టాన్ని తెచ్చే కృషి చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో జెఎసి చైర్మన్ రామేశ్వరరావు, వర్కింగ్ చైర్మెన్ శ్రీధర్ కుమార్ లోధ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం యూనివర్సిటీలలో ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీస్ యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు. తెలంగాణ ప్రత్యేకతలకు, పునాదులకు అనుగుణంగా ఈ రాష్ట్రానికి ప్రత్యేక చట్టం అవసరమని వివరించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యను పరిష్కరించాలనీ, విద్యారంగానికి న్యాయం చేయాలని కోరారు. వన్ టైమ్ ఛాన్స్ ఇచ్చి, వారిని అబ్జార్బ్ చేయాలని సూచించారు. రెగ్యులర్ నియామకాల కంటే ముందు ఈ ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. దీంతో విశ్వవిద్యాలయాల పనితీరు మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి సాంకేతికంగా, న్యాయపరంగా ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాబోమని వివరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ చేస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం సందర్శన సమయంలో కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయాన్ని పునరుద్ఘాటించారని తెలిపారు.

రాష్ట్రంలో 3.35 కోట్ల ఓటర్లు

- నియోజక వర్గాల వారీగా శేరిలింగంపల్లిలో అత్యధిక ఓట్లు
- తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సవరించిన ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు స్వీకరించిన అభ్యంతరాల తర్వాత చేసిన సవరణ అనంతరం తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. తెలంగాణలో మొత్తంగా 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,66,41,489 మంది పురుషులు, 1,68,67,735 మంది మహిళలు, 2,829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 5,45,026 మంది 18-19 సంవత్సరాల ఓటర్లు, 2,22,091 మంది 85 ఏండ్లు దాటిన సీనియర్ ఓటర్లు, 3,591 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. 5,26,993 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది, అతి తక్కువగా భద్రాచలంలో 1,54,134 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా హైదరాబాద్‌లో 46,24,192 మంది, అతి తక్కువగా ములుగులో 2,35,486 మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది కంటె 2,09,712 మంది మహిళలు, 2,80,514 మంది పురుషులు, 92 మంది థర్డ్ జెండర్ ఓటర్లు పెరిగినట్టు తెలిపారు. తుది సవరణల అనంతరం 35,907 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు.

ప్రకటించిన తుది ఓటర్ జాబితా తెలంగాణ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లతో పాటు ఫామ్-8 దరఖాస్తుదారులకు పోస్ట్ ద్వారా ఓటర్ గుర్తింపు కార్డ్‌ను ఇంటికే ఉచితంగా పంపిస్తామని తెలిపారు. 18 ఏండ్లు నిండి అర్హత కలిగిన వారికి కొత్త ఎన్‌రోల్‌మెంట్, దిద్దుబాట్లు, ప్రక్షాళన నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు ఫారం-6 (కొత్త ఎన్‌రోల్‌మెంట్), ఫారం-6ఎ, (ఓవర్సీస్ ఎలక్టర్లు), ఫారం-6బీ (వాలంటరీ ఆధార్ వివరాలు), ఫారం-7 (తొలగింపులు) ఫారం-8లో సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

టిజిజెఎల్ఎ కేలండర్‌ను ఆవిష్కరించిన ఇంటర్ విద్య డైరెక్టర్

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణ ఆదిత్య

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టిజిజెఎల్ఎ-475) నూతన సంవత్సరం కేలండర్‌ను ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను కాపాడుకోవడమే అధ్యాపకుల ప్రథమ కర్తవ్యమని అన్నారు. చదువులో తక్కువ సామర్థ్యం కనబరిచిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వారు ఫెయిల్ కాకుండా ఉత్తీర్ణత సాధించేలా పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు. వారిపై ప్రత్యేకంగా కేంద్రీకరించాలని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పొందేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలనీ, అందుకోసం అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిజిజెఎల్ఎ రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, కార్యనిర్వాహక సభ్యులు రేమిడి మల్లారెడ్డి, ఎం శ్రీనివాస్‌రెడ్డి, కెపి శోభన్‌బాబు, మల్లేపల్లి పూర్ణచందర్, వి రవిగౌడ్, రాష్ట్ర మహిళా కార్యదర్శులు సంగీత, ఎండి షాహినా, నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతిలోపు నియామక పత్రాలివ్వండి

- ఇంటర్ విద్యా కమిషనరేట్ వద్ద జెఎల్ అభ్యర్థుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగలోపు నియామక పత్రాలను ఇవ్వాలంటూ జూనియర్ లెక్చరర్ (జెఎల్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద వందలాది మంది అభ్యర్థులు వచ్చి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, విశ్వవిద్యాలయాల నుంచి 1,392 జెఎల్ అభ్యర్థులు నియామక పత్రాలను ఇవ్వాలంటూ కోరారు. ధ్రువపత్రాల పరిశీలన ఉందంటూ రెండు రోజుల కింద ఆర్‌జెడి కార్యాలయం నుంచి సమాచారం వచ్చిందని, ఆ తర్వాతి రోజు వాయిదా పడిందంటూ సమాచారం వచ్చిందని తెలిపారు. దీంతో జెఎల్ అభ్యర్థులు ఆందోళన చెందారు. దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చాక వాయిదా పడిందంటూ సమాచారం ఇవ్వడంతో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 2022లో నోటిఫికేషన్ ఇచ్చారని, 2023లో పరీక్షలను నిర్వహించారని వివరించారు. గతేడాది తుది ఫలితాలను విడుదల చేశారని తెలిపారు. కానీ నియామకపత్రాలను మాత్రం ఇంకా ఇవ్వడం లేదన్నారు. త్వరితగతిన నియామకాలను పూర్తి చేయాలని, తద్వారా విద్యారంగ ప్రక్షాళన సాధ్యమవుతుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ఈ సంక్రాంతి పండుగలోపే తమకి నియామక పంత్రాలను ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో ముఖ్యభూమిక పోషిస్తామని తెలిపారు. ప్రయివేటు జూనియర్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేస్తామనీ, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని వివరించారు. నీట్, జెఇఇ, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వంలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి లింగానాయక్, కిరణ్, రాజశేఖర్, వేణు, ముత్యాలు, చందు, నరేష్, శ్రావణ్, సుమన్, కిషోర్, ఆనంద్, తుకారాం, ప్రవళిక, మైత్రి, చిత్రిత, రాణి, సతీష్‌కుమార్, కృష్ణ, ప్రకాశ్ నాయక్, అనిత, సుభాషిని, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

- విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేయొద్దు
- టిజియు ఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ రంగంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్లను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టిజియుఇఇయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. రాష్ట్రంలో పనిచేస్తున్న లైన్‌మెన్‌లకు సమానంగా పనిచేస్తున్న అన్‌మ్యాన్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గృహజ్యోతి పథకం తీసుకురావడం వల్ల పీస్ రేట్ వర్కర్లకు వచ్చే వేతనం తగ్గిందని, వారికి కనీస వేతనం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని, ఉద్యోగాల నియామకం చేపట్టి పని భారం తగ్గించాలని మహాసభలో తీర్మానం చేసినట్టు తెలిపారు. యూనియన్ రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

టిజియుఇఇయు (సిఐటియు) రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా వి కుమార చారి, రాష్ట్ర అధ్యక్షులుగా కె ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్ స్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా వి గోవర్ధన్, ఉప ప్రధాన కార్యదర్శులుగా ఎస్ చంద్రారెడ్డి, కె వెంకటనారాయణ, ఉపాధ్యక్షులుగా జి.సుధాకర్, కాటం మధు, ఎం.ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా బి.వెంకట రాజు, జె.ప్రసాదరాజు, ఎస్.రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా స్వప్న, వెంకటేశ్వరరావు, ఎం.కుమారస్వామి, ఎ.కిరణ్ కుమార్, మస్తాన్, వై.విక్రం రెడ్డి, జి.రవీంద్ర ప్రసాద్, రమేష్, కోశాధికారిగా జె.బసవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు చంద్రారెడ్డి, సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి గోపాల స్వామి, యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు చంద్రారెడ్డి, కాటం మధు, సాధాకర్, అశోక్, నాగేంద్ర రెడ్డి, రవి కుమార్ గౌడ్, కరుణాకర్, కనకరాజు, భాస్కర్, గిరి గౌడ్, భూపతి రాజు, చంద్రం, పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్ జైలుకెళ్లడం ఖాయం

- మతం పేరిట గెలిచిన బిజెపి పదేళ్లలో ఏం చేసింది..?
- టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు బి మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల సొమ్మును ప్రయివేటు కంపెనీకి దారాదత్తం చేసిన కెటిఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు బి మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. తొలుత జైలుకు వెళ్లేందుకు సిద్ధమని చెప్పిన ఆయన పసలేని.. పనికిరాని కేసు అంటూనే ఎసిబి నోటీసులు జారీ చేసి.. గవర్నర్ అనుమతివ్వగానే కోర్టును ఎందుకు ఆశ్రయించారని ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో సోమవారం కాంగ్రెస్ పార్లమెంటు స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ కుర్చీ కోసం ముగ్గురు పోటీ పడుతున్నారని ఆరోపించారు. ఆ కుటుంబం దోపిడీ చేయని రంగం లేదని వివరించారు. కాళేశ్వరం పేరిట రూ.లక్ష 25 వేల కోట్లు గోదావరిలో పోశారని విమర్శించారు. ప్రజల సొమ్మును వృథా చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని తెలిపారు. ఇప్పటి వరకు 16మంది సీఎంలు రూ.65వేల కోట్ల అప్పు చేస్తే కెసిఆర్ ఒక్కరే రూ.6.50 లక్షల కోట్ల అప్పు చేశారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంపై రూ.7.14లక్షల కోట్ల అప్పు ఉందని, ప్రతి నెలా ప్రభుత్వం రూ.6500 కోట్లు ఆర్‌బిఐకి చెల్లిస్తోందని వివరించారు. బిఆర్ఎస్ పదేళ్లలో చేయని అభివృద్ధి చేయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసిందని ఈ విషయంపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బిఆర్ఎస్ పార్టీ రాజకీయ శకం ముగిసిందని, ఆ పార్టీలో కెసిఆర్, కెటిఆర్ మాత్రమే మిగులుతారని జోస్యం చెప్పారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్ రెడ్డి

మరోవైపు బిజెపి చరిత్రను తిరగరాయడంతోపాటు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకులు మనువాద రాజ్యాంగాన్ని రాసుకోవాలని మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో మతం పేరిట ఎనిమిది మంది బిజెపి ఎంపిలు గెలిచారని, ఇందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్రానికి చేసిందేమీలేదని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక నిర్బంధం ఉన్నా పథకాలను అమలు చేస్తున్నామని, అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. వరంగల్‌కు విమానాశ్రయం తెప్పించామని, ఆదిలాబాద్‌లోనూ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ దీపాదాస్ మున్షి, రాష్ట్ర ఇన్‌చార్జి విశ్వనాథన్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలచారి, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడె గజేందర్, శ్రీహరిరావు, ఆత్రం సుగుణక్క తదితరులున్నారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ

- కలగా మిగిలిన ఆర్థిక సమానత్వం
- పాలకుల విధానాల వల్లే అసమానతల భారతదేశం
- రాజ్యాంగ రక్షణకు సంఘటిత పోరాటం
- 'కేంద్ర ప్రభుత్వ విధానాలు - రాజ్యాంగం, రిజర్వేషన్లపై ప్రభావం' : సెమినార్‌లో జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ.. తన పదేళ్ల పాలనలో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ సామాజిక న్యాయానికి తూట్లు పొడిచే విధానాలను అమలు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో "కేంద్ర ప్రభుత్వ విధానాలు-రాజ్యాంగం, రిజర్వేషన్లపై ప్రభావం" అనే అంశంపై అతిమేల మాణిక్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో ఆర్థిక సమానత్వం సాధించాల్సిన అవసరాన్ని అంబేద్కర్ నొక్కి చెబుతూ రాజ్యాంగంలో ఆర్టికల్ 46ను పొందుపర్చారన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ధనిక దేశంగా భారత్ ఐదో స్థానంలో ఉందని, త్వరలోనే మూడో స్థానానికి చేరుకోబోతున్నామని మోడీ గొప్పలు చెబుతున్నారని, కానీ వాస్తవానికి దేశంలో మాత్రం అందుకు భిన్నంగా ఉందన్నారు. దేశంలో ఇప్పటికీ 30 శాతం జనాభాకు నిలువ నీడలేదన్నారు. ప్రపంచంలో పౌష్టికాహారం, రక్తహీనతతో బాధపడుతున్న వారిలో భారత్‌లోనే సగం మంది ఉన్నారని అన్నారు. దేశంలో 10 శాతంగా ఉన్న సంపన్నుల చేతుల్లో 57 శాతం సంపద పోగై ఉందని, 50 శాతంగా ఉన్న పేదల చేతుల్లో మాత్రం 11 శాతం సంపద మాత్రమే ఉందని తెలిపారు. దేశ బడ్జెట్‌కు సరితూగేలా అదానీ ఆదాయం రూ.16 లక్షల కోట్లకు మించిపోగా, కోటాను కోట్ల భారతీయులు మాత్రం రెండు పూటల తిండికి నోచుకోని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాల్ని వేగంగా అమలు చేస్తూ ప్రభుత్వ రంగాల్ని ప్రయివేట్‌పరం చేస్తోందని విమర్శించారు. సామాజిక శ్రేణుల పురోగతిని జీర్ణించుకోలేని బిజెపి.. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా మార్పులు చేర్పులకు పాల్పడుతూ మనుధర్మ శాస్త్రాన్ని తెచ్చిపెట్టాలని కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. దేశంలో కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవట్లేదని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేకపోవడం, గ్రామీణ పేదలకు పని దొరుకుద్దన్న గ్యారంటీ లేకపోవడం, మహిళలు, దళితులు, గిరిజనులకు రక్షణ లేని దారుణమైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఒకే మతం, ఒకే దేశం, ఒకే ఎన్నికలంటూ బిజెపి మత ప్రతిపాదికన పద్ధతులకు శ్రీకారం చుడుతూ రాజకీయంగా లబ్ధిపొందేందుకు అనేక రూపాల్లో దాడులకు పాల్పడుతుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించి కార్పొరేట్ శక్తుల చేతుల పెట్టడం వల్ల సామాజిక వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు సామాజిక శ్రేణులంతా ఐక్యంగా ఉద్యమించేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం అడివయ్య, జిల్లా నాయకులు బాగారెడ్డి, అశోక్, సురేష్, మద్దూరు శివకుమార్, ఎ.నాగభూషణం, కె.రాజయ్య పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE AT VIZIANAGARAM
I.A.146/2024 O.S.38/2022

Between:
Sri Kotyada Uma Mahaeswara Rao
......Petitioner/Plaintiff
And:
Smt. TurpartiVenkatalakshmi& 15others
.......Respondents/Defendants

To,
R-1. SmtTurpartiVenkatalakshmi W/o Appala Sanyasi Karunakarudu, Goljam Village, Lakkavarupu Kota Mandal, Vizianagaram District.
R-2. SmtTurpartiSuneetha, D/o Appala Sanyasi Karunakarudu. Rest do-
R-3. Sri Turpati Sai Ram Kiran S/o Appala Sanyasi Karunakarudu, Rest do-
To,
R-6. Sri Rajesh Dugra, S/o Surya Rao, Hindu, age 37 years, Meyapur Colony, Sirilingapalli District, Telangana State, permanent resident of, Lakkavarupu Kota village and Mandal, Vizianagaram District.

NOTICE

Please take court notice/summons that the above I.A is filed against the Respondents 1 to 16. to restore the suit filed by the plaintiff dismissed for default on 18-10-2023 by the Honourble IV ADDL. DISTRICT JUDGE AT VIZIANAGARAM, due to non-service of Court Sum-mons i.e. RespondentNo.6of youThus, the Hon'ble Court pleased an order to serve the summons/notice under substituted service to the above stated Respondent.

Therefore, hereby, informing you that the above matter is posted to **20-01-2025** for your appearance before the Honourable Senior Civil Judge at Vizianagaram at **10-30 A.M.** If you fail to attend on that day, the matter will be heard and decided exparty.

(By Court Order)
J.V.V.JAGADEESWARA RAO
M(J) SRILAKSHMI & G.RAMANJINEYULU,
Advocates, Vizianagaram District.
Cell: 9246616118

అంబేద్కర్ ఆశయ విరోధి బిజెపి

- డిఎస్ఎంఎం జాతీయ అధ్యక్షులు, ఎంపి రాధాకృష్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కుల నిర్మూలన సిద్ధాంతానికి బిజెపి విరోధిగా వ్యవహరిస్తోందని డిఎస్ఎంఎం జాతీయ అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు కె రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు, కుతంత్రాలు చేస్తోందని వ్యాఖ్యానించారు. మతోన్మాద బిజెపిని సమైక్యంగా ఎదుర్కోవాలని కోరారు. సోమవారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ భవన్‌లో జరిగిన ఆల్ ఇండియా దళిత్ రైట్ మూమెంట్ (డిఎస్ఎంఎం) జాతీయ రెండో మహాసభల్లో ఆయన పాల్గొని సౌహర్ద సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ పదేళ్ల బిజెపి పాలనలో దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీ అభద్రతలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ధానాల ఫలితంగా దళితులపై 300 రెట్లు దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని విమర్శించారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి, చాతుర్వర్ణ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ఆర్ఎస్ఎస్ ఎజెండాతో బిజెపి హిందూత్వ సాధనకు కృషి చేస్తోందని వ్యాఖ్యానించారు. హిందుత్వ రాష్ట్రం, హిందూమతం వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. దేశ సమైక్యత, సమగ్రతకు భంగం కలిగించేలా రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను సమాధి చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని నీరు గారుస్తూ రాజ్యాంగబద్ధంగా అట్టడుగు వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లను లేకుండా చేస్తున్నదని వివరించారు. పేదల హక్కులపై దాడులు చేస్తూ, నియంతృత్వ ఫాసిజం వైపు ప్రయాణం చేస్తున్నదని చెప్పారు. రాజ్యాంగ పిఠికలో సెక్యులరిజం, సోషలిజం పదాలనే లేకుండా చేస్తామని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన బిజెపి పార్లమెంటు సభ్యులు నిస్సిగ్గుగా మాట్లాడడాన్ని నరేంద్ర మోడీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. మోడీ ఒక వైపు అంబేద్కర్‌ను మొక్కుతూ రాజ్యాంగ లక్ష్యాల్ని తొక్కుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తద్వారా అంబేద్కర్ ఆశయాలను సమాధి చేస్తున్నాడని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగాన్ని, రిజర్వేషన్లను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.కేంద్ర హోంమంత్రి మంత్రి అమిత్‌షా పార్లమెంటులో అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడటం ఆర్ఎస్ఎస్ విధానంలో అంతర్భాగమేననితెలిపారు. అభ్యుదయ శక్తులు,అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు దేశ సమైక్యత, సమగ్రత కోసం ఐక్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే విద్యుత్ బస్సులు : ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్రంలోని బిజెపి సర్కారు విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నదని ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య విమర్శించారు. సోమవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన "విద్యుత్ బస్సులు-ప్రజలు, ఆర్టీసీలపై ప్రభావం" అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో లక్ష్మయ్య మాట్లాడుతూ కాలుష్యం తగ్గించేందుకు విద్యుత్ బస్సులను తీసుకొస్తున్నట్టు ప్రభుత్వం చేస్తున్న వాదనను కుంటిసాకుగా కొట్టిపారేశారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీ పరిధిలో కాకుండా ప్రయివేటు రంగంలో తీసుకొస్తుండటంతో భవిష్యత్తులో ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. విద్యుత్ బస్సుల రాక తర్వాత వాటి నిర్వహణ వ్యయం కూడా ఎక్కువనీ, వాటితో ప్రజలపై ఛార్జీల భారం మోపుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇక సమరం చేయాల్సిందేనని సూచించారు.

నాలుగేళ్లలో 80 లక్షల ఇళ్ల నిర్మాణం

- జనవరి 31లోపు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ
- 1.5 లక్షల మొండిగోడల ఇండ్లను పూర్తి చేస్తాం
- జనవరి 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగేండ్లలో రాష్ట్రంలో 80 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదలకు పంపిణీ చేస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం హన్మకొండ జిల్లా కేంద్రంలో ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మాదిరిగానే వరంగల్‌లోనూ ఎలక్ట్రిక్ బస్సులను నడిపించడానికి నేడు ప్రారంభోత్సవం చేశామని, రెండో విడత సంక్రాంతిలోపు మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయన్నారు. దేశంలో టిజిఎస్ఆర్‌టిసిని మోడల్‌గా తీర్చిదిద్దే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. 2004-14 వరకు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లను కట్టించడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పదేండ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మిస్తామని చెప్పి కలలు కల్పించిందే తప్ప నిర్మించలేదని విమర్శించారు. ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. వాటిని జనవరి 31లోపు అర్హులైన పేదలందరికీ అందజేస్తామన్నారు. ప్రజాపాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటికే ఇంటింటి సర్వే నిర్వహించి 65 లక్షల మంది వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఏ ఒక్కరూ అభద్రతకు లోనుకావద్దన్నారు. దరఖాస్తు చేసుకోని వారు ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో చేసుకోవాలని, అధికారులు వెంటనే వాటిని యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. అలాగే, గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలేసిన 1.5 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని తెలిపారు. నిర్మించి వదిలేసిన ఇండ్లను అర్హులకు కేటాయించి, మరమ్మతులకు అయ్యే ఖర్చును ఆ ఇంటి యజమానికి చెల్లిస్తామని అన్నారు.

హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ అభివృద్ధి

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టంచేశారు. వరంగల్ నగరం ప్రత్యేకతను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి ప్రాధాన్యతనిస్తున్నారని, అందులో భాగంగానే మొదటి ఏడాదిలోనే సిఎం రెండుసార్లు నగరాన్ని సందర్శించారని తెలిపారు. మొదటి పర్యటనలో నగరంలో చేయాల్సిన అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి వారి అభిప్రాయాలను తీసుకున్నారన్నారు. ఎయిర్‌పోర్ట్, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల నిర్మాణం, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తనకు బాధ్యతలను అప్పగించారని చెప్పారు. రెండోసారి నగరానికి వచ్చిన సందర్భంలో రూ.6,000 కోట్లకుపైగా నిధులను మంజూరు చేశారన్నారు. 2041 మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. భద్రకాళి చెరువు పూడికతీత, వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు టెండర్లు పిలిచినట్టు తెలిపారు.

జనవరి 26 నుంచి రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు

ఈ నెల 26వ తేదీ నుంచి రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలు ఇవ్వనున్నట్టు మంత్రి చెప్పారు. దేశంలో అలాగే భూమి లేని వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు చెల్లిస్తామన్నారు. వరి పండించే రైతులకు భరోసా కల్పించే విధంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా చెల్లిస్తున్నట్టు తెలిపారు. అలాగే, 26వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులను జారీ చేయడానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినీరెడ్డి, హౌజింగ్ మేనేజింగ్ డైరెక్టర్ విపి గౌతమ్, హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజి వాఖడే తదితరులు పాల్గొన్నారు.

రూ.7.98 కోట్ల విలువైన మత్తుపదార్థాల ధ్వంసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్టుబడ్డ గంజాయితో పోలీసులు

నిజామాబాద్ డివిజన్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లాలోని వివిధ స్టేషన్లలో ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నమోదైన (71) కేసుల్లో రూ.7.98 కోట్ల విలువైన నిషేధిత మత్తు పదార్థాలను సోమవారం ధ్వంసం చేశారు. గంజాయి, ఆల్ఫాజోలం, డైజోఫామ్, గంజాయి మొక్కలను జక్రాన్‌పల్లి మండలం పడక్కల్ గ్రామంలో ఉన్న మెడికేర్ సర్వీసెస్ కెమికల్ ఫ్యాక్టరీలో ధ్వంసం చేసినట్టు కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారి హనుమంతరావు తెలిపారు. అట్టి నిషేధిత మత్తు పదార్థాల్లో 1285.25 కేజీల ఎండు గంజాయి, 32.585 కేజీల ఆల్ఫాజోలం, 71.845 కేజీల డైజోఫామ్, 114 గంజాయి మొక్కలు ధ్వంసం చేసినట్టు చెప్పారు. వీటి విలువ సుమారు రూ. 7,98,70,250 ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్లు విజయ్ కుమార్, మధుసూదన్ రావు, షాకీర్ హైమద్, సత్యనారాయణ, ఎస్ఐ విక్రమ్ కుమార్, నగేష్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంపివి వైరస్ పాతదే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెటాన్యుమోవైరస్ (హెచ్‌ఎంపివి) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, అయితే జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయొద్దని కోరింది. చైనాలో కేసుల సంఖ్య పెరుగుతుండటంతో వైరస్ వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మరోవైపు దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఒకట్రెండు కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనికి తోడు సామాజిక మాధ్యమాల్లో ఈ వైరస్‌కు సంబంధించి వ్యాపిస్తున్న సమాచారం కూడా ప్రజలను మరింత భయాందోళనకు గురి చేస్తున్నది.

హెచ్‌ఎంపివి మరో రెస్పిరేటరీ వైరస్ అనీ, చలికాలంలో జలుబు, ఫ్లూ తరహా లక్షణాలు కనిపిస్తాయని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ వివరించారు. ప్రత్యేకించి చిన్న పిల్లలు, వయోవృద్ధులు దీని బారినపడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇల్లు, ఇంటి స్థలాలివ్వాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్

కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పేదలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన నిరుపేదలందరికీ ఇల్లు, ఇంటిస్థలాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఇండ్లు లేని నిరుపేదలు, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులు ఇందిరమ్మ మూడో విడత ఇండ్ల స్థలాల లబ్దిదారులు, మహిళలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బైటాయించి ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పార్టీలకతీతంగా జరగాలని, గుడిసెవాసులందరికీ పట్టాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో అబ్బాస్ మాట్లాడుతూ.. జనగామ జిల్లాలో ఇండ్లు, ఇంటి స్థలాలు లేనివారు 30 వేల కుటుంబాలకు పైగా ఉన్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇల్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇల్లు కట్టుకోలేని ప్రజలు పూరిగుడిసెలు, అద్దె ఇండ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. వారంతా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని ప్రభుత్వ పట్టాలకోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. పటేల్‌గూడెం గ్రామంలో గుడిసెలు వేసుకున్నవారికి, బచ్చన్నపేటలోని గోపాల్ నగర్ 174 సర్వే నెంబర్‌లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, పాలకుర్తి మండలం మంచుప్పుల, లింగాలఘనపురం మండలం కళ్లెం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. నర్మెట్ట మండలం వెల్దండలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేదలకు ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ అమలు చేయాలని కోరారు. చిల్పూర్ మండలంలోని రాజవరంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనితోపాటు అర్హులందరికీ రేషన్ కార్డులు, అన్ని రకాల పించన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏవో మన్సూర్‌కి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, అహల్య, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేష్, పుత్కనూరి ఉపేందర్, మునిగల రమేష్, ఎండి.షబానా, బోడ నరేందర్, చిట్యాల సోమన్న, మండల కార్యదర్శులు గుండెబోయిన రాజు, బొడ్డు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల చర్చలు సఫలం

- సమ్మె తాత్కాలిక వాయిదా
- వేతనం ఇస్తాం :

ఉప ముఖ్యమంత్రి భట్టి



సమగ్ర శిక్ష ఉద్యోగులతో చర్చిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై జరిగిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో 27 రోజులుగా చేపట్టిన సమ్మెను తాత్కాలిక వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రకటించింది. సమస్యల పరిష్కారం కోసం గతనెల పదో తేదీ నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్, టిజిఒ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు సమక్షంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం చర్చలు జరిపింది. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతోపాటు పలు హామీలను భట్టి ఇచ్చారు. పేస్కేల్ అమలు గురించి మంత్రివర్గ ఉపసంఘంలో అతి త్వరలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. మిగిలిన అంశాలను వెంటనే విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపించి ఆమోదయోగ్యం అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. సమ్మె కాలానికి వేతనం చెల్లిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా, ప్రభుత్వంపై నమ్మకం ఉంచి సమ్మెను వాయిదా వేయాలని ఆయన కోరారు. డిమాండ్లన్నింటినీ పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి చెప్పారు. తాము ప్రభుత్వం దృష్టికి తెచ్చిన ప్రతి సమస్య కూడా పరిష్కారం అవుతుందని నమ్ముతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ చారి, ముఖ్యసలహాదారులు శ్రీధర్‌రెడ్డి, పాషా, కోశాధికారి దుర్గం శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్లు సహదేవ్, సురేందర్, క్రాంతి, నాయకులు చందు, జానకిరామ్, సంధ్యారాణి, అమృతి, ఫాతిమా, బిందుశ్రీ, జయశ్రీ, మంజులత, రమేష్, చంద్రశేఖర్, మహేందర్, యాదగిరి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- నేరుగా కమిషనర్ చేతికే వినతిపత్రాలు
- చర్యలకు మూడు వారాల గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రా నేతృత్వంలో నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం మొదటిసారి నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువలా వచ్చాయి. ప్రతి సోమవారమూ నిర్వహించ తలపెట్టిన ప్రజావాణిలో భాగంగా మొదటి రోజు 83 ఫిర్యాదులు వచ్చాయి. హైడ్రా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మొదలై రాత్రి వరకు వచ్చిన ఫిర్యాదులను నేరుగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వీకరించారు. ఫిర్యాదుదారులకు ముందుగా టోకెన్లు అందజేశారు. సమస్య ఏమిటి..? ఏ ప్రాంతానిది..? పూర్తి వివరాలు తెలుసుకుని అప్పటికప్పుడే స్థానిక అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు కమిషనర్ సూచించారు.

హైడ్రా పరిధిలోని ఫిర్యాదులే కాకుండా ఇతర శాఖలకు చెందిన సమస్యలపై కూడా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఆయా శాఖాధిపతులకు అందజేయాలంటూ కమిషనర్ సూచనలు చేశారు. అయితే, ఔటర్ రింగ్ రోడ్డు పరిధి దాటి ఇతర జిల్లాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. తమ పరిధిలో లేదని ఫిర్యాదుదారులకు కమిషనర్ నచ్చజెప్పి వెనక్కి పంపించారు. సామాన్యుల నుంచి ప్రభుత్వ, పోలీసు ఉద్యోగులు, ఆర్మీ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఇలా అన్ని వర్గాల నుంచి కమిషనర్‌కు నేరుగా ఫిర్యాదు చేశారు. ప్రతి ఫిర్యాదుపై హైడ్రా కార్యాలయంలో అధికారులతో చర్చించారు. ఆయా ఫిర్యాదులు ఎవరి పరిధిలో ఉంటే వారికి అందజేసిన కమిషనర్ వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. మీరు కూడా ఫాలోఅప్ చేయాలంటూ ఫిర్యాదుదారులకు కమిషనర్ సూచించారు. మూడు వారాల్లో ఫిర్యాదుపై స్పందన ఉంటుందని తెలిపారు.

ఇంటి స్థలం కాజేశారని విశ్రాంత సైనికుడి ఫిర్యాదు

తనకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలంతో పాటు, పార్కు స్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ మహిళ కాజేసిందని 1971లో ఇండో పాక్ వార్‌లో నేరుగా పాల్గొన్న విశ్రాంత సైనికుడు పి.సీతారామరాజు ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూమిని నోటరీ చేసి అమ్మేస్తున్నారని, మొత్తం 6 వేల ఎకరాలకుగాను 2500 ఎకరాలు మాత్రమే మిగిలిందని, దీనిని కూడా ప్లాట్లు చేసి అక్రమ లే ఔట్‌తో అమ్మేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తాజాగా 15 ఎకరాల స్థలాన్ని స్థానికంగా ఉన్న వ్యక్తి కాజేయాలని ప్రయత్నిస్తున్నారని ముఖేష్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ నాలాకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని 60 గజాల ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారని, వరద నీరు వచ్చి చేరే లోతట్టు ప్రాంతంలో పేదవారు ఇల్లు కొనుక్కొని మోసపోతున్నారని, వెంటనే ఆపాలంటూ ఉప్పల్ నియోజకవర్గం చిలకానగర్ కార్పొరేటర్ భర్త ప్రవీణ్ ముదిరాజ్ ఫిర్యాదు చేశారు.

సాఫ్ట్‌వేర్ దంపతుల ఆత్మహత్య

అనాథలైన ఇద్దరు పిల్లలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఉన్న భార్యాభర్తలిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి..

వరంగల్ జిల్లాకు చెందిన సందీప్ (30), కీర్తి (26) దంపతులు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. అమీన్‌పూర్‌లోని బంధంకొమ్ము శ్రీధం హిల్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ ఎంఎన్‌సి కంపెనీల్లోనే పనిచేస్తూ మంచి వేతనాలు తీసుకుంటున్నారు. అయితే, సోమవారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు ఏంటనేది స్పష్టంగా తెలియరాలేదు. కానీ, కుటుంబ సమస్యలు, కలహాలతోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ జంటకు ఐదేండ్ల కిందట వివాహమైంది. మూడేళ్ల కుమార్తె, 14 నెలల కొడుకు ఉన్నారు. ఆ పసివాళ్లను చూసిన వారంతా కంటతడి పెట్టుకున్నారు. మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించనున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సాధారణ ప్రసవమే మంచిది

కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్య నిపుణుల వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి వారి ప్రసవం అయ్యేవరకు, ఆ తర్వాత కూడా వారికి భర్తల నైతిక మద్దతు చాలా అవసరం ఉంటుందని గచ్చిబౌలి కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ గైనకాలజిస్టులు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ నిపుణులు తెలిపారు. గచ్చిబౌలిలోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం "మామ్ టు బి కార్నివాల్-2025" అనే కార్యక్రమం వైభవంగా జరిగింది. దాదాపు ఆరు నెలల గర్భం ఉన్న 60 మంది మహిళలు, వారి భర్తలు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ప్రాంగణమంతా సందడిగా మారింది. భర్తలు అండగా ఉంటేనే భార్యలకు సులభంగా సాధారణ ప్రసవం అవుతుందన్నారు. గర్భం దాల్చినట్లు తెలిసినప్పటి నుంచి భర్తలు తమ భార్యలను అనుక్షణం కనిపెట్టుకుని ఉండడంతో పాటు.. వారికి అన్నిరకాలుగా మద్దతుగా నిలవాలని, వారిలో వచ్చే మార్పులను జాగ్రత్తగా గమనించుకుంటూ.. అవసరమైనప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. మహిళ ఆరోగ్యం, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం దృష్ట్యా చూసినా సాధారణ ప్రసవమే మంచిదన్నారు. ఒకవేళ లోపల బిడ్డ అడ్డం తిరిగినా, వేరే వైద్యపరమైన ఇబ్బందులు ఏమైనా ఉన్నా అప్పటికప్పుడు మేమే నిర్ణయం తీసుకుని సిజేరియన్ చేస్తామని.. వైద్యపరమైన సమస్యలు ఏమీ

ఆశాలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి

వైద్యారోగ్య కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. ప్రమోషన్లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య శాఖ కమిషనర్‌కు ఆర్‌వీ. కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కనీస వేతనం రూ.18 వేల వేతనాన్ని ఫైనల్ చేయాలని విన్నవించారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తిచేసిన ఆశాలకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు కల్పించాలనీ, వెయిటేజీ మార్కులు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. ఆశాలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్ వర్తించేలా, మట్టి ఖర్చులకు రూ.50 వేలు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలపు హామీలను, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు ప్రకటించాలనీ, ప్రసూతి సెలవులు ఇవ్వాలని విన్నవించారు. ఆశాల విధుల్లో లేని పనులను గుర్తించి వాటికి పారితోషికాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. 2022, 23, 24 సంవత్సరాల్లో చేపట్టిన లెప్రసీ సర్వే పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2024 మార్చి 3-5 వరకు నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం డబ్బులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రుల్లో ఆశాలకు రెస్ట్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఆశాలపై పనిభారం తగ్గించాలనీ, పారితోషికం లేని పనులు చేయించకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.సునీత, ఉపాధ్యక్షులు ఆర్.సాధన, టి.యాదమ్మ, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపురిలో అతి పెద్ద కుంభకోణం

కమిటీని రద్దు చేసి అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మణికొండ చిత్రపురి కాలనీలో డాక్టర్ ఎం ప్రభాకర్ రెడ్డి సినీ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరిగింది తెలంగాణలోనే అతి పెద్ద కుంభకోణం అని, ప్రస్తుత అక్రమాల చిత్రపురి కమిటీని వెంటనే రద్దు చేసి అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. చిత్రపురి కాలనీ అక్రమాలు, అవినీతిపై సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు రాజకీయ నాయకులు మాట్లాడారు.

టిపిసిసి ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్ మాట్లాడుతూ.. చిత్రపురి కాలనీ కుంభకోణాన్ని సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, కుంభకోణానికి పాల్పడ్డ సొసైటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు మాట్లాడుతూ.. చిత్రపురి అవినీతి వింటుంటే అసలు మనం సమాజంలో ఉన్నామా అనే అసహ్యం వేస్తోందన్నారు. బాధితులకు ఎర్రజెండా అండగా ఉంటుందని, చిత్రపురి అక్రమార్కుల భరతం పట్టే వరకూ వదిలేది లేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ.. అసలు ఇన్ని అక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వ అధికారులు ఏమి చేస్తున్నారని, ముందు వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఇప్పటికే చిత్రపురి అవినీతిపై అనేక పోరాటాలు చేసిందని వివరించారు. టిజెఎస్ నాయకులు నర్సయ్య మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల నుంచి ఈ సమస్య గురించి మీడియా ద్వారా వింటున్నామని, దీని గురించి టిజెఎస్ నాయకులు, ఎమ్మెల్సీ ఎం కోదండరాం చర్చించారని, దీనిపై త్వరలో వామపక్ష పార్టీలు, ఆప్ పార్టీ నాయకులందరం సిఎంను కలిసి విన్నవించాలని అన్నారు. సీనియర్ రాజకీయ నాయకులు దేశ్ పాండే మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి ఈ పోరాటంలో పాల్గొంటున్నానని, ప్రభుత్వ అధికారులు కోర్టు ఆదేశాలను దిక్కరిస్తుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. చిత్రపురి అవినీతి, అక్రమాలు.. రాష్ట్రం సిద్ధించిన తర్వాత జరిగిన అతి పెద్ద కుంభకోణమని అన్నారు. చిత్రపురి బాధితులకు అండగా ఉండడమే కాకుండా అవినీతి అధికారులను జైలుకు పంపించే వరకు వదిలి పెట్టబోమని హెచ్చరించారు.

ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. చిత్రపురి అక్రమాలపై అన్నీ పార్టీలతో జెఎసి ఏర్పాటుచేయాలని, ప్రస్తుత అక్రమాల చిత్రపురి కమిటీని రద్దు చేయాలని తీర్మానించారు. అడ్ హాక్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, సిఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్య తీవ్రత తెలియజేయాలని అన్నారు. ఈ సమస్యపై టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, టిజెఎస్ నేత, ఎమ్మెల్సీ ఎం కోదండరాం, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆమ్ ఆద్మీ కన్వీనర్ దిడ్డి సుధాకర్, దేశ్ పాండే తదితరులు అందరితో కలిసి వెళ్లాలని తీర్మానం చేశారు.